క్లుప్తంగా

బాల్య వివాహాలు నివారించాలి



గూడూరులో సమావేశం నిర్వహిస్తున్న బాల్య వివాహాల నిరోధక కమిటీ అధికారులు

గూడూరు: బాల్య వివాహాలు నిర్మూలించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మండలస్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీ చైర్మన్, తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన సదస్సులు నిర్వహించడం, చదువు మధ్యలో ఆపకుండా కొనసాగించేలా బాలికలకు ప్రోత్సాహించాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడులలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే బాలికలు రక్తహీనతకు గురికాకుండా సరైన మందులు ఇప్పించాలన్నారు. కమిటీ సభ్యులు ఎంపీడీఓ మాధవీలత, ఎంఈఓ సునీలమ్మ, ఏఎస్ఐ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీకి 45 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, మోడల్ స్కూళ్లలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. నాల్గవ రోజు మంగళవారం గణిత పరీక్షకు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 191 మందికి గాను 171 మంది, మోడల్ స్కూల్లో 182 మంది విద్యార్థులకుగాను 157 మంది హాజరైనట్లు ఆయా పాఠశాలల పరీక్ష నిర్వహణ అధికారులు హెచ్ఎం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి తీర్చండి

గూడూరు: పట్టణంలో నెలకొన్న తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిలా కమిటీ కార్యదర్శి కేవీ నారాయణ కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 15 రోజులుగా తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే తాగు నీటి సమస్య పరిష్కరించకపోతే ప్రజల సహకారంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు నాయకులు వెంకటేశ్వర్లు, నాగులాపురం రవి, చనుగొండ్ల కోటయ్య, మాధవకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపులే బీసీ గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆయా కేటగిరీల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శంసున్నిసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 12వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 15న గోరంట్ల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 98665 59664 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి



కె.నాగలాపురంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య పేర్కొన్నారు. కె.నాగలాపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యులు రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించాలని సూచించారు. వివిధ రోగాలతో బాధపడుతున్న వారు వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న రోగుల ఇంటికి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు మందులను అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు అయ్యేలా ఆశా కార్యకర్తలు, ఏఎస్ఎంలు చూడాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కల్లూరు: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) సెంటర్‌లో అసోసియేట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్, సర్వేయర్ కోర్సులపై స్థానిక బిర్లా గేట్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల శిక్షణ ఈ నెల 8 తేదీన ప్రారంభమై 45 రోజులపాటు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 81424 10410, 73963 18379 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

- మండలానికి ఖరీఫ్‌కు 2 వేల మెట్రిక్‌టన్నులు కేటాయింపు
- రాయితీ విత్తనాలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు



పాణ్యం ఆర్‌బీకేకు చేరిన డీఏపీ బస్తాలు



పాణ్యం ఆర్‌బీకేలో రైతుకు జీలుగ విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

పాణ్యం: రైతు పక్షపాతిగా పేరుగాంచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభంకల్లా రైతులకు కావాల్సిన రాయితీ విత్తనాలు, ఫర్టిలైజర్ ఎరువులు, నీలిమందులను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలకు చేర్చింది. వర్షాలు కురవడమే తరువాయి అన్నట్లుగా అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధంగా ఉన్నారు. నేలను దుక్కి చేసుకుని, పశువుల ఎరువులు చల్లుకున్నారు. ప్రస్తుతం అన్ని ఆర్‌బీకేలకు ఫర్టిలైజర్ ఎరువులు చేరుకుంటున్నాయి. గత ఖరీఫ్, రబీ సీజన్లలో సమృద్ధిగా వర్షాలు కురవడం, పంటలు బాగా పండి మంచి దిగుబడులు,మద్దతు ధరలు లభించడంతో రైతులు మంచి లాభాలు గడించారు. ఈ ఏడాది కూడా మంచి వర్షాలు కురుస్తాయని సూచనలు ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆలోచనలకు తగ్గట్టే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామ స్థాయిలో ఆర్‌బీకేలను స్థాపించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, భూసార పరీక్షల సేవలను పొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఏడాది కూడా ఖరీఫ్ ప్రారంభం నుంచే రైతులకు విత్తనాలు, ఫర్టిలైజర్ ఎరువులను ఆర్‌బీకేలకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 7 వేల హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కొందరు రైతులు ఇప్పటికే బోర్ల కింద పత్తి సాగు చేస్తున్నారు. అలాగే ఎస్సార్బీసీ కాల్వ కింద రైతులు అధికంగా పంటలు సాగు చేస్తారు. కాల్వలకు నీరు విడుదల చేయగానే రైతులు విత్తనాలు చల్లుతారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని మొత్తం 19 ఆర్బీకేలకు ఫర్టిలైజర్ ఎరువులను కేటాయించారు.

మండలంలో ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అందించేందుకు 2,538 మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్ ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపడడంతో ఆ మేరకు ఎరువుల స్టాకు ఆర్‌బీకేలకు చేరుతోంది. పంటల సాగు ప్రారంభించిన నాటి నుంచి రైతులకు కావాల్సిన ఎరువులను ఆర్బీకేల నుంచి పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు. వీటితో పాటు ఇప్పటికే మండలానికి 73.3 టన్నుల జీలుగ విత్తనాలు కేటాయించారు. అధికారులు జీలుగలను కావాల్సిన రైతులు అందిజేస్తున్నారు.

ఆర్బీకేలకు కేటాయించిన ఫర్టిలైజర్ ఎరువుల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

డీఏపీ	యూరియా	కాంప్లెక్స్ (20.20.0.13, 10.26.26)	ఎస్ఎస్‌పీ (సింగిల్ సూపర్ పాస్ఫేట్)	ఎంఓపీ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్)
442	1,437	613	15	31

ఖరీఫ్‌లో సాగయ్యే పంటల వివరాలు (అంచనా)

పంట పేరు	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	3,395
మొక్కజొన్న	393
కొర్ర	5
కంది	266
మినుము	40
పెసలు	10
వేరుశనగ	1
ఆముదం	6
సోయాచిక్కుడు	161
ఎండుమిర్చి	1,363
పసుపు	13
ఉల్లి	5
పత్తి	963
పొగాకు	30
ఉద్యాన పంటలు (అరటి, మామిడి, సపోట)	247
మొత్తం	6,898

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు, మార్కెట్ ధరకు ఎరువులను అందిస్తున్నాం. ఇందుకు సంబంధించి మండలాలనికి రావల్సిన ఫర్టిలైజర్ డీఏపీ ఆర్‌బీకేలకు చేరింది. అలాగే మిగతా ఎరువులు వస్తున్నాయి. వాటికి సంబధించి ధరల వివరాలు రావాల్సి ఉంది. 50 శాతం రాయితీతో జీలుగ విత్తనాలను అందిస్తున్నాం. విత్తనాల కోసం రైతులు ముందుగానే నమోదు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులోని ఎరువుల వివరాలను రైతులకు తెలియజేస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జయప్రకాష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

అభివృద్ధి పనులకు భూమిపూజ



వై.ఖానాపురంలో పైపులైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ సునీత

గూడూరు రూరల్: మండల పరిధిలోని వై.ఖానాపురంలో అభివృద్ధి పనులకు ఎంపీపీ సునీత భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు రూ.4.03 లక్షల నిధులు, తాగునీటి పైపులైన్ కొరకు రూ.7.2 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఎంపీడీఓ మాధవీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన, పీఆర్ ఏఈ గోపాల్‌రావు, జెడ్పీటీసీ మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, మాధవస్వామి, రామచంద్ర పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కల్లూరు: పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు (జేడీ) డాక్టర్ రామచంద్రయ్య సూచించారు. మంగళవారం ఆయన తడకనపల్లె గ్రామంలో ఉన్న పశు వసతి గృహాన్ని పరిశీలించారు. ఎండల తీవ్రత ఇంకా తగ్గనందున పాడిలో పాల ఉత్పత్తి తగకుండా పశు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశు వసతి గృహంలో సమస్యలను పాడిరైతులు ఆయన దృష్టికి తెచ్చారు. 5 హెచ్‌పీ గడ్డి కత్తెరించే యంత్రం కావాలని, పశువుల మేత, అజోలా పెంపకం కోసం సిమెంట్ తొట్లు నిర్మించాలని సమీకృత దానమృత్తం కేటాయించాలని కోరారు. చిన్నటేకూరు పశు ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, వీహెచ్ఏ సాయి ప్రశాంతి, సభ్యురాలు జుబెదాబీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఓర్వకల్లులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఒకటవ వార్డులో గల పెండేకంటి నగర్, నీలి షికారి పేట, బస్టాండ్ ప్రాంతాలలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించి గత నాలుగేళ్లలో జగనన్న అందించిన పాలనను వివరిస్తూనే ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద ప్రజల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హతగల ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్కరికీ కూడా పట్టాలను అందజేసిన దాఖలాల్లేవన్నారు. మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ తిప్పన్న, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచు తోట అనూష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం



గోరుకల్లు కట్ట పిచ్చింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: గోరుకల్లు జలాశయ బండ్ కుంగిన ప్రదేశంలో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం గోరుకల్లు జలాశయం కట్ట కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి ఇంజినీర్లతో చర్చించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండ్ స్వల్పంగా కుంగిపోయిందని, దీనిపై జలవనరుల మంత్రితో చర్చించానన్నారు. అలాగే 1వ తేదీన జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించినట్లు చెప్పారు. తక్షణమే స్పందించిన సీఎం జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శికి సూచనలు ఇచ్చారన్నారు. ఉన్నతాధికారులు కుంగిన ప్రదేశాన్ని పరిశీలించి చేపట్టాల్సిన పనులపై ప్రణాళికను అందించినట్లు తెలిపారు. ఇటీవలే గోరుకల్లు జలాశయం నిర్వహణకు రూ.68 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం ఏర్పడ్డ ఫాల్ట్‌జోన్ (కుంగిన కట్ట)ను రూ.70 లక్షలతో మరమ్మతులు చేసేందుకు నాలుగు రోజుల క్రితమే ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కట్ట కుంగిందని, అపోహాలు సృష్టించే వారి మాటలు నమ్మొద్దని, ఎలాంటి భయాందోళన అవసరం లేదని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు.


అధికారులకు సూచనలు

జలాశయం కట్టకు రెండు చోట్ల ఫాల్ట్ జోన్‌గా గుర్తించిన అధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలని ఎమ్మెల్యే సూచనలు చేశారు. మరమ్మతుల విషయంపై ఇంజినీర్లతో చర్చించారు. నీటిని దిగువకు వదిలేస్తే ఇంకేమన్నా ఫాల్ట్ జోన్‌లు ఉంటే బయటపడతాయన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మాజీ జట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ఉసేన్‌బాషా, ఎంపీటీసీలు, డీఈఈ నాగభూషణం, ఏఈ అమృత్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు జేవీకే కిట్లు పంపిణీ

పాణ్యం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అందజేసే జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలానికి యూనిఫారం, టెక్ట్సుబుక్స్, డిక్షనరీ, బెల్ట్స్, షూ తదితర వస్తువులు వచ్చాయన్నారు. వాటిని వేరు చేసి ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. బడి తెరచిన రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తామని చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



సి.బెళగల్‌లో ఉద్యోగుల సమీక్షలో మాట్లాడుతున్న మండల అధికారులు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో గృహ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకునేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ, హౌసింగ్, వైకేపీ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ సుమంత్‌తో కలిసి, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్, వైకేపీ, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వారాంతంలోగా గృహ నిర్మాణాలలో పురోగతి లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ ఉద్యోగులను హెచ్చరించారు. ఇంకా నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు బేస్‌మట్టం దశకు చేరుకునేలా చూడాలని, లేదంటే థర్డ్ పార్టీ నిర్మాణాలకు ముందుకు రావాలని, నిర్మాణాలపై నిర్లక్ష్యం చేసే అనుమతులు రద్దవుతాయన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని ఎంపీడీఓ సూచించారు. మండలంలో 190 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉండగా 32 ఇళ్లు ప్రారంభ దశలో, 45 బేస్‌మట్టం లెవల్, 15 లెంటల్ లెవల్, 15 ఆర్‌సీ లెవల్, 93 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు హౌసింగ్ ఏఈ తెలిపారు. సమీక్షలో ఈఓఆర్డీ సందీప్, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న, టీఏలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు
- గోరంట్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన ఎమ్మెల్యే సుధాకర్



గోరంట్లలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు వీలవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో సర్పంచు బాలకృష్ణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను గడప గడపకు వెళ్లి స్వయంగా తెలుసుకున్నారు. తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, కరెంట్ స్తంభాలు వేయించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, పింఛన్లు మంజూరు చేయించాలంటూ కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారికి వెంటనే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులకు సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మతం తారతమ్యం లేకుండా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి ముంగింటకే సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, స్థానిక నాయకులు వేణుగోపాల్ రెడ్డి, బాలు, నాయుడు, మనోహర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేస్తు న్న ఎమ్మెల్యే సుధాకర్, సర్పంచ్ బాలకృష్ణ

రైతు సంక్షేమానికి కృషి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో కంది విత్తనాల శ్యాంపిల్ బ్యాగులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఏఓ రవిప్రకాష్ రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 10 నుంచి 15మంది రైతులకు ఉచితంగా 4 కిలోల శ్యాంపిల్ కంది విత్తనాల ప్యాకెట్లను ప్రభుత్వం అందజేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ



సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కల్లూరు: వైఎస్సార్ బీమాపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండలంలోని బొల్లవరం, పుసులూరు గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. బడి బయట పిల్లలను సర్వే చేసి వివరాలు యాప్‌లో నమోదు చేయలన్నారు. గర్భవతులు, బాలింతలు, యుక్త వయసు బాలికల్లో రక్త హీనత ఉన్నవారిని గుర్తించి అదనపు పోషకాహారం అందించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, కల్యాణమస్తు/షాదీతోఫా పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సర్వే, ప్రతి రోజు 3 గంటల నుంచి 5 వరకు స్పందన నిర్వహించాలని ఆదేశించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన కె.చిన్న వెంకటేశ్వర్లు (41) ఈ నెల 3న కర్నూలులో హమాలీ పని ముగించుకుని రాత్రి చెట్లమలాపురం బస్‌స్టాప్ వద్ద ఆటో దిగాడు. రోడ్డు దాటుతుండగా కర్నూలు నుంచి ఉలిందకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్న వెంకటేశ్వర్లు తల, ఎడమ కాలికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డంప్ యార్డును తరలించండి

గూడూరు: పట్టణంలో కుమ్మరి గుంతల సమీపంలో ఏర్పాటు చేసిన డంప్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలని తెలుగు వీధి, రేవల వీధి,హక్కిం వీధి ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో సేకరించిన చెత్త, చెదారాన్ని అక్కడ డంప్ చేస్తుండడం వల్ల తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళ దోమలు విజృంభిస్తున్నాయని వాపోయారు. సమస్యను పలుమార్లు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

శాశ్వత డంప్ యార్డు ఏర్పాటు చేస్తున్నాం

పట్టణానికి శాశ్వత డంప్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మునుగాల రహదారిలో డంప్‌యార్డు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఇటీవలే ఆర్డీఓ పరిశీలించి వెళ్లారు. త్వరలో అక్కడ డంప్ యార్డు ఏర్పాటు చేస్తాం.

– నరసింహులు, మున్సిపల్ ఏఈ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన బెస్త సుధాకర్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పెద్ద కొట్టాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బెస్త సుధాకర్ (35) మృత్యువాత పడ్డాడు. ఘటనకు సంబంధించి వెల్దుర్తి పాత బస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసే గోవిందు కుమారుడు సుధాకర్ వివిధ ప్రాంతాల్లో పండ్ల తోటలను లీజుకు తీసుకుని వ్యాపారం చేసుకుంటూ భార్య పిల్లలను పోషించుకుంటున్నాడు. కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయం సమీపంలో బంధువులు దేవర నిర్వహించగా సుధాకర్ హాజరయ్యాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరి వెళుతుండగా పెద్ద కొట్టాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమ్లానాయక్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్న పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 17వ తేదీలోపు ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్టి నైట్ (ఐడీసీఎఫ్) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆశా వర్కర్ తమ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో, అంగన్‌వాడీ కేంద్రాలలో తప్పనిసరిగా ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. గర్భవతులు, 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు.